కథానిక

# కన్న కడుపు

కార్యంపూడి కృష్ణమూర్తి

"ఏం పిల్లలో యేం లోకమో! ఎందు కొచ్చినట్టు. కూటికా - గుడ్డకా. వల్ల కాట్లో పిల్లలు" అన్నాడు పిల్లలంటే కడిచచ్చే నరసయ్య నిస్పృహతో.

నాటికీ నేటికీ నెత్తరిగేట్టు కట్టెలు మోస్తూనే వుంది సుబ్బమ్మ. పాలబుగ్గల పసిడి ముద్దగ తయారైన తమ వలపుపంట రామదాసును చూసుకుంటే కడుపు నిండేదామెకు. తనకు పెట్టినా పెట్టకపోయినా అవసాన కాలంలో యిన్నినీళ్లు గొంతులోపొయ్యడానికున్న ఆధారమా పసిగుడ్డే. బిడ్డమీద వున్న వాత్సల్యమో, మోక్షమిప్పించడానికున్న ఒకానొక ఆధారమన్న అభిమానమో, లేక రెంటి చేరికో తెలియదుగాని సుబ్బమ్మ కా బిడ్డమీద వున్నంత ప్రేమ తన ప్రాణంమీద సైతం వున్నట్టు కనుపించదు. రక్తాన్ని డబ్బులుగా తయారుచేసే తన శరీర యంత్రంలోని భాగాలు అరిగిపోయినా, మరమ్మత్తు కోరినా లెఖ్ఖచేసేదికాదు సుబ్బమ్మ. వడియకట్టిన శిథిల జీవన సారంతో పెంచుతున్న దా బిడ్డను. ఏడాది క్రితం బ్రద్దలైన తన పసుపు కుంకాన్ని తలుచుకున్నప్పుడు పొర్లివచ్చే దుఃఖాన్ని నివారించ కలిగిందా పసిపాప ముద్దు మొగ మొక్కటే.

సుబ్బమ్మకు నా అన్న వాళ్లండి కూడా లేని వాళ్లయారు. ఎద్దంటి మరి దుండేం ప్రయోజనం? వదినని తన్నుచూచి కాకపోయినా అభంశుభం తెలియని ఆబిడ్డ ముఖం చూచైనా ఇంత సాయం చెయ్యొవచ్చు. ఘనుడు యెలాగైతేనేం వున్న వూళ్లో పచ్చి మంచినీళ్లు పుట్టకుండా చేశాడు. ఆస్తి అప్పులకే సరిపోదని తెంచి పోసిన మరుక్షణం గడప తొక్క నివ్వలేదు. సీతారామయ్యగారి కేదో విషం పోసినట్టున్నాడు. ఆయన మంచంలో ఉన్న రెండు నెల్లూ మంచీ చెడ్డా అంతా విచారించినవాడు ఆయన పోయిం తర్వాత తిరిగి చూడలేదు. పువ్వులమ్మిన చోట కట్టె లమ్మినట్టుంటుందని సుబ్బమ్మ పసిపాపతో సహా వూరు విడిచి పోయింది. మరిది తన మీద యింత పగ బూనటానికి కారణ మామె కెంత యోచించినా మనసుకు తట్టలేదు.

సుబ్బమ్మకు పుట్టినింటి దిక్కు లేకపోలేదు. తల్లీతండ్రీ లేకపోయినా ముగ్గురు అన్న లున్నారు. అంద రామె అవస్థ కండ్లారా చూస్తూ వూరు కున్నారు. తనకై తాను వాళ్లయింటి కెళ్లడానికామె అభిమానం అడ్డు వడ్డది. తనను ముక్కలుగా చీల్చినా వూరుకుంటుంది కాని తన సర్వస్వం-రామదాసును వాళ్లు చిన్నమెత్తు మాటంటే వోర్చుకో గలదా? తనజీర్ణకంకాళంమీద ఆనంద సౌధాలు నిర్మించాలి వాడికి.

సుబ్బమ్మ నెరుగనివాళ్లు లేరా వూళ్లో. ఏసు క్రీస్తంతటివాడు చచ్చిం తర్వాత గొప్పవాడని పించుకుంటే సుబ్బమ్మ బ్రతికుండగానే మంచి పేరు తెచ్చుకుంది. ఆమెకు వచ్చిన ఆపదకు అందరూ విచారించేవారే. ఆమెకు సానుభూతి చూపని నరపురుగు ఆ గ్రామంలో లేదు. సానుభూతి చూపనివా రెంఖర్మ,ఏవిధంగానూ సాయం చేసినవారు కూడా కనుపించలేదు. తన కాళ్ళ మీద తాను నిలబడలేనినాడు కాళ్లక్రింద భూమి కూడా క్రుంగుతుంది. సుబ్బమ్మకు సాయం చేయలేనివాళ్లు తమ నిస్సహాయతను తెలియజేస్తే, చెయ్యకలిగినవాళ్లు సాకులు చెప్పారు. రక్తసంబంధం వున్న అన్నదమ్ములే వూరుకుంటే, ఆమె ఏడుపు పెరగడానికి మాటల్ని జతచేసే యితరుల కేం పట్టింది.

ఎవరూ సాయం చెయ్యకపోయినా సుబ్బమ్మ విచారించలేదు. ఎవరుగానీ ఊరకనే సాయం చెయ్యరని ఆమెకు తెలుసు. తన్ను పుట్టించిన దేవుడికే తనమీద దయలేనప్పుడు యితర్ల సంగతి అనుకోవలసిన పని యేముంటుంది? వాకి లూడ్చి

దగ్గరనుంచి పక్కలు వేసేదాకా అన్నిపనులూ సుబ్బమ్మ చెయ్యగలదు. కన్నబిడ్డలను పెంచలేనివాళ్లు, జడలు వేసికోడంచేతగాని వాళ్లు, పెనిమిటికి పక్క వెయ్యడానికి అభిమానం పడే వాళ్లు అనేకమంది వున్నారు. అటువంటి వాళ్లకు పనులు చేస్తే తన పొట్ట కింతకూడు దొరక్కపోదు. రెక్కలున్నంతకాలం యితర్లమీద ఆధారపడాల్సిన అవసరమామెకు కనుపించలేదు.

* * *

తనకు ఆనందాన్ని, తృప్తిని యివ్వలేని దేన్నిగాని మానవుడు ప్రేమించలేడు. ఒకదానివల్ల కలిగే ఆనందానికంటే రెండవదానివల్ల యెక్కువ ఆనందం లభిస్తున్నప్పుడు రెండవదానిమీద కలిగిన ప్రేమ మొదటిదానిమీద వున్న ప్రేమను జయిస్తుంది. దీన్ని యే నైతికసూత్రం బంధించలేదు. అసలీ నైతికసూత్రాలు ప్రాపంచిక వ్యవహార సౌలభ్యంకొరకు యేర్పాటు చెయ్యబడ్డవన్న రహస్యం తెలుసుకున్న తర్వాత వాటికున్న విలువ తగ్గుతుంది. దృఢమైన వ్యక్తిగతాభిప్రాయాలమీద దాడి సలుపుతున్నప్పుడు యే మానవుడూకూడా (వెన్నెముకలేని రాములవారి వంటివాడు తప్ప) సాంఘిక నియమాలకు దాసుడు కాజాలడు.

గారడీలా వుంది. లేక అదేమేనా మందూ మాకూ పెట్టిందో? ఆ అభిమానం, భక్తి, వినయం, గౌరవం యింతలో యేమైనాయో! ఏమో అంతా మాయగా వుంది. చిన్న నేరం చెయ్యడానికి దడగా వుండేది, అమ్మ ఏమనుకుంటుందోనని. తన్ను గురించి అమ్మ ఎందుకో కంట నీరుపెట్టుకుంది. ఆ రోజల్లా తను అన్నం తినలేదు. తనవల్ల దోష ముంటే క్షమించమని అమ్మ రెండుకాళ్ళూ పట్టుకుని వలవల ఏడ్చాడు. "ఏం లేదు నాయనా!" అని తల్లి తన్ను బుజ్జగించి ముద్దలు చేసి నోటి కందిస్తుంటే అన్నం తిన్నాడు. ఇప్పుడు ఆ అమ్మే కంటికి మంటికి ఒకటేధారగా యేడ్చినా, నల్లరాళ్ళను కరగించే చూపులతో చేతులు జోడించి తన ముందు వ్రాలినా అసహ్యించుకుంటున్నాడు. వెనుకటి అమ్మే...వెనుకటి రామదాసే...

తల్లి యేం చెప్పినా వినడు. విన్నా "నీకెందుకే! ముసలిదానివి. ఏదో అది వేళ కింత కాచిపోస్తుంటే హాయిగా కృష్ణా రామా అంటూ కూర్చోక" అంటాడు. తప్పెవరిదైనా నిజానిజాలు తెలిసికొందామనే అభిప్రాయమున్నట్టు కూడా లేదతనికి. ఇరుగు పొరుగు వారు కూడా అదే మాటంటున్నారు. "నీకెందుకమ్మా ముసలమ్మకు, రేపో మాపో చచ్చేదానికి- వాళ్ళ యిష్టంవచ్చినట్టు వూరేగనివ్వక." ఇదేమిటి వీళ్లు కూడా యిట్లా అంటున్నారు! తనమీద వీళ్ళకుండే అభిమానమంతా యేమైపోయింది? ఒక్కరు కూడా న్యాయం చెప్పరేం? ముసలిదైనంత మాత్రంచేత యింట్లో తనకున్న అధికారాన్ని వదలుకుంటుందా? కోడలిమీద తన కొడుక్కు యెంత అధికారం వుందో తనకూ అంతే! అది యేపాటుపడ్డా చూస్తూ వూరుకోడానికా తను వుంది? పదినెల్లూ మోసి, కని, పెంచి పెద్దవాణ్ణిచేసి, దాని వల్లోపడి చెడిపోతుంటే చూస్తూ యెట్లా సహించడం? పిచ్చి సన్యాసి- తెలియక వాడు తన్ను తిట్టినంత మాత్రంచేత......

ఒకరి బాధ్యతను వొకరు నెత్తిన వేసుకోడం వంటి తెలివితక్కువపని మరొకటుండదు. తన కోడలిమీద తనకు బాధ్యత వున్నమాట వాస్తవము. కాని తనకంటే ఎక్కువ బాధ్యత కలవాడు తన కొడుకన్న విషయ మా ముసలి బుర్రకు తట్టలేదు.

రామదాసు నడుపుతున్న బస్సును ఓవర్‌లోడ్ చేశారు. అధికారులకు పట్టుబడ్డారు. బస్సు వోనర్సుకు మాటవొచ్చింది, రూపాయలూ వొదిలినై. రామదాసు వుద్యోగం వూడింది. కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరుకున్నాడు.

పాపమా ముసల్ది తన కొడుక్కు చదువు చెప్పించాలెనని, అత నేదో ఉద్యోగం చేస్తూంటే చూడాలెనని చాలా ఉబలాట పడ్డది. కాని రామదాసు సరైన అదుపులేక అల్లరి చిల్లరిగా తిరిగి చివరకు కారు నడపడం నేర్చుకున్నాడు.

రామదాసు యిల్లు సమీపిస్తుండగానే రంకెలు వినిపిస్తున్నాయి. తన యింటి ముందు పదిమంది పోగైనారు. వారందరితో ముసల్ది యేదో చెప్పుకుంటోంది. భార్య వంటగదిలో ఆకాశం దద్దరిల్లేటట్టుగా అరుస్తున్నది. నేరుగా వంట యింట్లోకి వెళ్లాడు రామదాసు. "ఏమిటీ వాలగోల- ఆ

ముసల్దేమన్నా పొరపాటు చేస్తే కొంచెం సర్దుకు పోకూడదూ?" కోపంగా అన్నాను. ఆ యిల్లాలు చేతులు తిప్పుకుంటూ "ఏమిటి సర్దుకుండేది. నా వల్ల కాదు బాబు! ప్రతిదానికి సాధించేస్తే పోయె ముదనష్టపు సాధింపు. అన్నిటికీ తప్పేనా? పంచలో కూర్చుంటే తప్పు, పొరుగింటి కెళితే తప్పు, పూలు ముడుచుకుంటే తప్పు, సినిమా సంగతులు మాట్లాడుకుంటే తప్పు- అన్నీ తప్పులే. ఆయనగారొచ్చే వేళయింది, కేకలేస్తారు, వంట త్వరగా కావాలి, కాస్త తాళింపు వేసు కుందవమ్మా! సుబ్బాయమ్మ దగ్గరకు వెళ్లి వస్తానన్నందుకేగా యీ రాద్ధాంత సిద్ధాంతాలన్నీను. ఈ కాపురం చెయ్యడం నాతరం కాదు బాబు" అంటూ పెట్టె సర్దుతోంది శ్రీమతిగారు. తను వడివడిగా బైటకువచ్చి "నీ కెన్నిసార్లు చెప్పాలి తిని ఓచోట పడుండమని. ఇంట్లో విషయాలు నీకెందుకు? యిట్టా అయితే నా యింట్లో ఒక్క క్షణం వుండడానికి వీలు లేదు. దిక్కులేని దానివై పోతావని వూరుకుంటుంటే ... ..." ఉండబట్టలేక తల్లి చడామడా మాట్లాడ్డం... సహించలేక రామదాసా మెను బూటుకాలుతో తన్నడం అంతా అనుకున్నంతలో జరిగిపోయినై.

* * *

"ఆ! చేస్తే చేయించుకుండేవాళ్లే గాని పెట్టేవాళ్ళా పోసేవాళ్ళా" అని తడబడుతూ అంటుంది సుబ్బమ్మ. షష్టిపూర్తి దాటిన సుబ్బమ్మ అడుక్కుతింటున్నది. తన శరీరంలోని మేలురకపు కండలన్నీ కాల్చి యిచ్చి పెంచిన కొడుకు కండ్లయెదుటనే వున్నాడు. తను పడేపాట్లు చూస్తూనే వున్నాడు. తల్లి కష్ట యితరులు చూపే సానుభూతి సైతం చూపించడు.

"నీ కడుపున పుడతా, చిన్నం సాయం చేస్తావూ!" సుబ్బమ్మ కష్ట సాయంతో వచ్చి అడిగింది.

"తప్పకుండా" అన్నాను.

"ఏమీ లేదు. ముసలిముండను అడుక్కుతింటూ అందులోనే మిగిల్చి యీ గ్లాసు కొన్నాను..."

"అవుతే?"

"రెండణాల సగ్గుబియ్యం, ఆరణాలచక్కెర ఆరణాలబత్తాయికాయలు,ఒక పావలాకు అవ్వేం టమ్మా అవ్వీ మొత్తం రూపాయిబేడ కావాలి?"

"ఎందుకూ!"

"ఎందు కేమిటి, డాక్టరు చెప్పాడు. అన్నం తింటే అరగదుట."

"నీకా? యింత పెద్దదానివైనా ప్రాణమంటే మమకారం వదల్లేదే నీకు."

"నా క్కాదు. అదేం చేసిం దనుకున్నా! అబ్బాయో! వాణ్ణి వొదిలిపెట్టి పోయిందిగా."

"ఎవరు?"

"ఎవరేమిటి? నీ దంతా విడ్డూరం. అదే మా కోడలు."

"ఎక్కడికి?"

"ఏమో!"

"ఎప్పుడు?"

"పదిరోజు లైంది."

"ఇంతకూ రూపాయి బేడా యెందుకో చెప్పావు కాదేం!"

"కన్నకడుపు కావడాన నా కుంటుంది కాని యెవరి కేం పట్టింది? దానిదారి నది చక్కా లేచి పోయింది టింగురంగా అంటూ. వాడు చస్తే దానికేం, వుంటే దానికేం."

"వాడికా యీ పరంజామా అంతా. తన ప్రాణంవుండగా నీచేతి పచ్చి మంచినీళ్లు ముట్టు కోనన్నాడు. ఏ దిక్కు..."

"కోపం మానవుణ్ణి పశువుని చేస్తుంది. ఏదో కోపంగా వున్నప్పుడు అనివుంటాడు."

"నీకు దిక్కున్న చోట బ్రతకమన్నాడుగా నిన్ను. నేటికి నీవే దిక్కైనా వనమాటవాడికి."

"వాడి దేముంది నాయనా! పిచ్చి సన్యాసి. దానిమాటలు విని చెడ్డాడుగాని నా వరాలబాబు వాడికేం."

"ఊ! బాగానే వుంది..."

"ఇక్కడే కూచుంటే యేమౌతుంది, దిక్కూ మొక్కూ లేకుండా మంచంలో ఒక్కణ్ణీ వదిలిపెట్టి. రా నాయనా! త్వరగా పోవాలి. వాడు మంచంలో 'అమ్మా!' అంటూ కలవరిస్తూంటాడు."

వింత పడుతూ లేచాను- సుబ్బమ్మకు డబ్బు యివ్వటానికి.